
ప్రజాశక్తి
మంగళవారం 9 జనవరి 2024
8 పేజీలు
విశాఖపట్నం
అనకాపల్లి





నేడే జివిఎంసి వార్షిక బడ్జెట్



◆ సమావేశానికి ఏర్పాట్లు పూర్తి
◆ అంకెల గారడీ తప్ప అభివృద్ధి లేదంటున్న ప్రతిపక్ష కార్పొరేటర్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ 2024-25 ఆర్థిక సంవత్సర ప్రత్యేక బడ్జెట్ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో జరుగనుంది. రెవెన్యూ వ్యయంగా ఈ ఆర్థిక సంవత్సరానికి 14 పద్దుల కింద రూ.165,135 లక్షలుగా పేర్కొన్నారు. రశీదులు కింద రూ.189,802 లక్షలుగా అంచనా వేస్తున్నారు. సాధారణ పద్దు, ఇంజినీరింగ్, లైటింగ్, ప్రాజెక్టులు, ప్లానింగ్, యుసిడి, విద్య, పార్కులు, లీజర్స్ అండ్ సిమెటరీస్, ప్రజారోగ్యం, మంచినీటి సరఫరా, అమృత్, ఇతర నిధులతో ప్రాజెక్టులు, ఆర్థిక సంఘం నిధులు, డిపాజిట్లు అడ్వాన్సులు వంటి 14 రకాల పద్దులలో పై ఆదాయ, వ్యయం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇది అంకెల గారడీ మినహా ఈ బడ్జెట్ అంచనాల్లో వాస్తవాన్ని ప్రతిబింబించే పనులేవీ కానరావడం లేదని సిపిఎం, జనసేన, సిపిఐ కార్పొరేటర్లు చెబుతున్నారు. ఇప్పటి వరకూ జివిఎంసిలో వైసిపికి కార్పొరేటర్ల బలం అధికంగా ఉన్నందున అజెండాలను బైపాస్ చేసుకుంటూ వెళ్లిపోతుండడం తెలిసిందే. సాధారణ సమావేశాల్లో ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఇది బడ్జెట్ ప్రత్యేక సమావేశమే అయినా దీంట్లో ప్రత్యేకత ఏమీ ఉండదంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆస్తి పన్ను నగరంలో ప్రజలపై భారీగా పెంచడంతో మధ్యతరగతి జనం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. వారికెలాంటి ఉపశమనమూ ఉండడం లేదు. చెత్త మీద పన్నులు సామాన్యులను, పేదలను అవస్థలపాల్జేస్తున్న మిగతా 2లో..

గిఫ్ట్ కార్డ్‌ను తిరస్కరిస్తున్నా

- సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ఎంవిపి.కాలనీ : జివిఎంసి బడ్జెట్ సందర్భంగా పంపిన గిఫ్ట్ కార్డ్‌ను తాను తిరస్కరిస్తున్నట్లు సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు ఉక్కునగరం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. ఈ మేరకు ఆయన మేయర్ గొలగాని హరి వెంకట కుమారికి లేఖ రాశారు. ఆ వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించారు. 'మహా విశాఖ నగర పాలక సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమావేశాల సందర్భంగా మీరు వేల రూపాయల విలువ చేసే గిఫ్ట్ కార్డును నాకు పంపారు. ఆ గిఫ్ట్ కార్డును సిపిఎం కార్పొరేటర్‌గా నేను తిరస్కరిస్తూ తమరికి తిరిగి పంపిస్తున్నాను' అని లేఖలో పేర్కొన్నారు. 78వ వార్డుకు సంబంధించి ఉక్కునగరం ప్రజలెవ్వరూ ఈ గిఫ్ట్ కార్డులను ఆమోదించరని తెలియజేశారు. ఈ సంస్కృతికి స్వస్తి పలకాలని గతంలో సూట్‌కేసు, గిఫ్ట్ కూపన్‌లు పంపినప్పుడు వాటిని తిరస్కరిస్తూ మేయర్‌కు తెలియజేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయినప్పటికీ మళ్లీ ఇప్పుడు పంపించారన్నారు. ప్రజల మీద అస్తి పన్ను భారీగా మిగతా 2లో..



పోలీసుల అదుపులో యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షురాలు గాయత్రి

గురువులపై నిర్బంధం

- విజయవాడ వెళ్లకుండా అరెస్టులు
- పోలీసుల అదుపులో యుటిఎఫ్ నాయకులు

▸ వార్త మెయిన్‌లో..

నగర ప్రాజెక్టుల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి చేపడుతున్న పలు ప్రాజెక్టులను ట్రైనీ ఐఎఎస్‌లు సోమవారం పరిశీలించారు. వారికి అన్నింటినీ చక్కగా వివరించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రాజెక్టు ఆఫీసర్ బంటు సన్యాసినాయుడు, పర్యవేక్షక ఇంజినీర్లు వినయ్ కుమార్, కెవిఎన్.రవి, కృష్ణారావులను ఆదేశించారు. సోమవారం విశాఖ నగరానికి విచ్చేసిన 18 మంది 2022 బ్యాచ్ ట్రైనీ ఐఎఎస్‌లకు జివిఎంసి అధికారులు నగరంలో చేపడుతున్న పలు ప్రాజెక్టులను చూపించారు. ముఖ్యంగా కాపులుప్పాడలో జిందాల్ చేపడుతున్న చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్రాజెక్టుపైనా, ఫ్లోటింగ్ సోలార్ వ్యవస్థపైనా, ఎంవిపిలోని స్పోర్ట్స్ ఎరీనా తీరుపైనా వివరించారు. నగరంలోని వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌కు తరలించి, ఆ చెత్త నుంచి విద్యుత్తు తయారు మిగతా 2లో..

ఎస్మాకు భయపడేది లేదు

▸ వార్త 8లో..

ఎయులో ఉత్సాహంగా యువభేరి

▸ వార్త 3లో..

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే ఊరుకోం

▸ వార్త 2లో..



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా పనిచేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించాలని, ఆ దిశగా జిల్లా అధికారులు కృషి చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యమూ వహించరాదని, నిర్ణీత కాలవ్యవధిలో నాణ్యమైన పరిష్కారం చూపాలని సూచించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం మల్లికార్జున అధ్యక్షతన జరిగింది. జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, డిఆర్ఒ కె.మోహన్ కుమార్, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల మిగతా 2లో..

మున్సిపల్ కార్మికుల చలో కలెక్టరేట్

◆ అడ్డుకున్న పోలీసులు, సరస్వతీ పార్కు వద్ద తోపులాట
◆ 300 మంది అరెస్టు



మున్సిపల్ కార్మికులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ జివిఎంసి పరిధిలోని మున్సిపల్ కార్మికులు సోమవారం చేపట్టిన చలో కలెక్టరేట్‌ను పోలీసులు భగ్నం చేశారు. సరస్వతి పార్కు నుంచి ర్యాలీగా కార్మికులు బయలుదేరగా పోలీసులు భారీగా మోహరించి అడ్డుకున్నారు. కార్మికులు వారిని తీవ్రంగా ప్రతిఘటించి కలెక్టరేట్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు 300 మందిని అరెస్టు చేసి పోలీసు బ్యారెక్స్ ప్రాంతంలోని కళ్యాణ మండపానికి తరలించారు. అరెస్టయిన వారిలో జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజు, నాయకులు ఎస్.రమణ, ఎం.ఈశ్వరరావు, జెఆర్.నాయుడు, రత్నం, యుజిడి వర్కర్స్ యూనియన్ నాయకులు ఇ.ఆదినారాయణ ఉన్నారు. వారందరినీ పోలీసులు సాయంత్రం విడిచిపెట్టారు.



సభలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు జగ్గునాయుడు

ఉద్యమం ఉధృతం : నాయకులు

తొలుత సరస్వతీ పార్కు వద్ద జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సభ చేపట్టగా వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు. వారినుద్దేశించి యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 రోజులుగా సమ్మె జరుగుతున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. చర్చల సందర్భంలో ప్రభుత్వం ముఖ్యమైన డిమాండ్లను మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మున్సిపల్ కార్మికుల చలో కలెక్టరేట్

నెరవేర్చలేదన్నారు. ఉద్యమాన్ని పోలీసులతో అణగదొక్కే ప్రయత్నం చేయడం అవివేకమే అవుతుందని తెలిపారు. కనీస వేతనం, కార్మికులను రెగ్యులర్ చేయడం వంటి హామీలను నెరవేర్చే వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. రానున్న కాలంలో ఉద్యమం మరింత ఉధృతమవుతుందని స్పష్టం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మున్సిపల్ కార్మికులకు సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించారు. టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.శ్రీభరత్, దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. జగన్ హామీల పేరిట ఎలా మోసగించిందీ తెలిపారు.

నేడే జివిఎంసి వార్షిక బడ్జెట్

సంగతి తెలిసిందే. రోడ్లు, కాలువల అభివృద్ధికి నగరంలో నిధుల కోత పెడుతున్నారు. కొన్ని ముఖ్యమైన పార్కులనే అభివృద్ధి చేసి వందల పార్కులను నిర్లక్ష్యం నీడన వదిలేశారు. సాగర్‌నగర్, ఎండాడ వంటి చోట్ల రోడ్ల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. కార్పొరేటర్, స్థానిక వైసిపి ప్రజాప్రతినిధులపై తీవ్ర విమర్శలు ప్రజలు చేస్తున్నారు. నగరంలో పలు వార్డుల్లో రోడ్ల నిర్మాణం ఎక్కడా సక్రమంగా జరగకపోవడం విమర్శలకు తావిస్తోంది. వీధిలైట్ల నిర్వహణ కూడా అనేక చోట్ల అధ్వానంగా ఉంది.

రెవెన్యూ కలెక్షన్ ఇలా..

2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి వరకూ ఆస్తి పన్ను డిమాండ్ జివిఎంసి పరిధిలో రూ.400 కోట్లు కాగా రూ.228 కోట్లు ఇప్పటి వరకూ వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

గిఫ్ట్ కార్డ్‌ను తిరస్కరిస్తున్నా

పెంచారని, చెత్త మీద యూజర్ ఛార్జీలు విధించారని, బిల్డింగ్ ప్లాన్ రుసుములు పెంచారని తెలిపారు. చిన్న చిన్న కార్మికులు, అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల నెలవారీ వేతనం రూ.15000 పైబడితే వారికి నెలకు రూ.200 చొప్పున వృత్తి పన్ను కింద భయపెట్టి వసూలు చేస్తున్నారన్నారు. త్వరలో మంచినీటి ఛార్జీలు పెంచబోతున్నారని తెలిపారు. విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర నియోజకవర్గాల పరిధిలో మంచి నీటి కుళాయిలకు నీటి మీటర్లు బిగిస్తున్నారని అన్నారు. ఆ ప్రాంతాల్లో నీటి సరఫరాను ఎన్‌సిసి అనే ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టారని వెల్లడించారు. ముడసర్లోవ పార్కు, స్విమ్మింగ్ పూల్, స్టేడియాలు, ఆటస్థలాలు, ఖాళీ స్థలాలు తదితర వాటిని ప్రైవేట్‌పరం చేస్తున్నారన్నారు. రెండో వైపు రోడ్లు, కాలువల నిర్వహణకు నిధులు కోతబెడుతున్నారని తెలిపారు. కాలనీ పార్కులను, వార్డు గ్రంథాలయాలను, కమ్యూనిటీ హాళ్లను, ఆట స్థలాలను, పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. బ్యూటిఫికేషన్ పేరిట నిధులను వృథా చేస్తున్నారని తెలిపారు.

ప్రజలకు హాని చేసే విధానాలను అమలు చేస్తూ, పన్నుల భారాలు మోపుతూ రెండో వైపున ప్రజల నుండి పన్నుల ద్వారా వస్తున్న ఆదాయాన్ని కార్పొరేటర్లుకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, మంత్రులకు, ఎంపీలకు గిఫ్ట్ కార్డ్‌లుగా ఇవ్వడాన్ని విశాఖ ప్రజలెవ్వరు హర్షించరన్నారు. ఇది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని తెలిపారు. గతంలో అధ్యయనం పేర రెండు సార్లు కార్పొరేటర్లతో యాత్రలు నిర్వహించి రూ.కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇప్పటికీ అధ్యయన రిపోర్టులు ఇవ్వలేదన్నారు. ఆ సందర్భంగా కార్పొరేటర్లతో మేయర్ నిర్వహిస్తున్న అధ్యయన యాత్రలను ప్రజలు విహార యాత్రలుగా భావిస్తున్నారని, వాటిని రద్దు చేయాలని తెలియజేస్తూ.. ఆ యాత్రలను సైతం తాను బహిష్కరించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు లైఫ్ స్టైల్ షాపింగ్ మాల్‌లో నచ్చినవి కొనుగోలు చేసుకోవాలని గిఫ్ట్ కార్డ్‌లు పంపారని, దీనిని కూడా తిరిగి పంపిస్తున్నానని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే చర్యలకు ముగింపు పలకాలని కోరారు.

అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా పనిచేయండి

నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందనకు 322 వినతులు అందగా వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 131, జివిఎంసికి చెందినవి 83, పోలీసు శాఖకు సంబంధించినవి 24, ఇతర విభాగాలకు చెందినవి 84 ఉన్నాయి. కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన అర్జీదారుని సమస్యను సావధానంగా వినాలని, తదుపరి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి, పరిష్కారానికి మార్గం చూపాలని అన్నారు. అనంతరం వివిధ శాఖలలో పెండింగ్ అర్జీలపై కలెక్టర్ ఆరా తీశారు.

నగర ప్రాజెక్టుల పరిశీలన

చేస్తున్నట్టు తెలిపారు. తద్వారా నగరంలో కాలుష్యం తగ్గడమే కాకుండా నగర అవసరాలకు విద్యుత్‌ను వినియోగించవచ్చునన్నారు. ముడసర్లోవలోని ఫ్లోటింగ్ సోలార్ వ్యవస్థ ద్వారా 40 శాతం విద్యుత్ ఆదా చేయగలుగుతున్నామని వారికి తెలిపారు. కార్యక్రమంలో జిందాల్ కంపెనీ ప్రతినిధులు, ఫ్లోటింగ్ సోలార్ నిర్వాహకులు, జివిఎంసి ఉప కార్యనిర్వహణ ఇంజినీరు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

మేయర్, కమిషనర్లకు వాటర్ ఫిల్టరేషన్ వర్కర్ల వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం సోమవారం నాటికి 8వ రోజుకు చేరింది. జివిఎంసిలోని నాన్ పిహెచ్ వర్కర్స్ యూనియన్లు అన్నీ కలిపి జెఎసిగా ఏర్పడ్డాయి. జెఎసి నాయకులు బి.ఆనంద్ కుమార్, కార్యదర్శి డి.శేఖర్, ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఎస్.శంకర్ రెడ్డి, పి.సతీష్, ఆర్.సత్యం తదితరులు స్పందనలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారికి, కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని, రూ.26 వేలు కనీస వేతనం చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం విశాఖలోని గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా వున్న ఎస్ఇ ఆఫీస్ వద్ద ధర్నా జరిగింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. విద్యుత్ సవరణ చట్టం 2020ని రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేయాలని, మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిదినాల కుదింపు ఆపాలని, పీస్‌రేట్ రద్దు చేయాలని, నెలవారీ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్టోర్స్‌లో పనిచేస్తున్న హమాలీలకు కూడా పీస్ రేటు రద్దు చేసి నెలవారీ జీతాలు ఇవ్వాలన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు, సెక్షన్ ఆపరేటర్లు, కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, వాచ్‌మ్యాన్లకి షిఫ్ట్ ఆపరేటర్లుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు పెట్టి మీటర్ రీడర్లను ఉద్యోగాల నుంచి తొలగించే చర్యలను మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యనారాయణ, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు అవతారం, మహేష్, శ్రీను, రాజులతోపాటు షిఫ్ట్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద ఆటో కార్మికులు విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ ఆటోరిక్షా కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బి.జగన్, ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలకు ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ప్రతిపక్షం, పాలకపక్షం నాయకులు ప్రకటించడం చాలా సంతోషించదగ్గ విషయమే అయినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది లక్షల మంది ఆటో కార్మికులు ప్రజారవాణానే నమ్ముకుని జీవిస్తున్నారని, దీనిని గుర్తించి, ఆటో రంగాన్ని కాపాడాలని కోరారు. ఆటో కార్మికులకు కేరళ, తమిళనాడు తరహాలో వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. డీజిల్, పెట్రోల్ సబ్సిడీ ధరపై అందివ్వాలన్నారు. జీవో 21 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కెవి.రమణ, త్రినాధరావు, ఎల్.కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.



నిరసన తెలుపుతున్న ఆటోకార్మికులు

తోపుడు బండ్లు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ద్వారకానగర్ 4, 5 లైన్ల తోపుడుబండ్లు, బడ్డీల చిల్లర వర్తక కార్మికులు సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి విశాఖపట్నం తోపుడుబండ్ల కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి ఎ.సింహాచలం మాట్లాడుతూ తొలగించిన తోపుడుబండ్లను తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 2014 స్ట్రీట్ వెండర్స్ చట్టం ప్రకారం ఎక్కడ బతికే తోపుడు బండ్లు, బడ్డీలు, చిల్లర వర్తకలను అక్కడే బతకనీయాలని చట్టం చెబుతుందన్నారు. సంఘం మద్దిలపాలెం జోన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు మాట్లాడుతూ తోపుడు బండ్లు, బడ్డీల చిల్లలవర్తకులపై జివిఎంసి అధికారులు, సచివాలయ ఉద్యోగుల దాడులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో తోపుడు బండ్లు, బడ్డీల కార్మికులు ఆర్.శ్రీను, వెంకటరెడ్డి, రాజి, రాము తదితరులు పాల్గొన్నారు. అనంతరం జివిఎంసి కమిషనర్‌కు స్పందనలో వినతి పత్రం సమర్పించారు.

ఓట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అక్రమంగా ఓట్లు తొలగించిన వారిపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.మల్లికార్జునకు సోమవారం ఆయన వినతి పత్రం సమర్పించారు. తన ఓటుతో పాటు తన తల్లిదండ్రుల ఓట్లు కూడా గల్లంతయ్యాయన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే ఊరుకోం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ సంస్థలకు అమ్మివేస్తే చూస్తూ ఊరుకునేది లేదని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు గొలగాని అప్పారావు, సిఐటియు నాయకులు కొవిరి అప్పలరాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 1012వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు గాజువాక జోన్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించని మోడీ ప్రభుత్వానికి వాటిని అమ్మే హక్కు లేదన్నారు. దీక్షల్లో ఈశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, గాజువాక

E.P. 10/2023 in O.S.15/2019

Between:
మహమ్మద్ మునీరుద్దీన్,
S/o. శ్రీ తాజుద్దీన్,
డోర్ నెం. 19-4-12, గుణదల,
విజయవాడ ...D.Hr
And
షేక్ ఆయుషా ఫర్హానా ...J.Dr
Notice to J.Dr.
షేక్ ఆయుషా ఫర్హానా,
W/o. మహమ్మద్ సలీమ్ ఆలీ,
డోర్ నెం.7-12-41,హోలీక్రాస్ చర్చిప్రక్కన పంతులు గారి మేడ,
పాత గాజువాక-530026.

పైన తెలిపిన E.P. 10/2023 నెంబరులో మీరు J.Dr. అయివున్నారు. మీ అడ్రస్‌కు ఇది వరకే మేము నోటీసులు పంపియున్నాము. మీరు ఆ నోటీసులను తీసుకోలేనందున కోర్టు ఉత్తర్వుల ప్రకారం మీరుకానీ, మీవకీలు ద్వారా గాని తేది. **29-01-2024** న వాయిదాకు పైన తెలిపిన కోర్టులో ఉ॥ గం॥ **10.30** ని॥లకు హాజరు కావలెను. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమున కోర్టువారు విచారించి తీర్మానము చేయుదురని తెలియజేయడమైనది.

వాయిదా తేది. 29-01-2024
M. MANOJ KUMAR, Advocate
#43-5-44, Rly. New Colony, Visakhapatnam-16.
Cell: 99663 39212 / 97048 07698

ORDER 21 RULE 66 OF CPC

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT SRIKAKULAM.

E.P.32 /2018 in A.R.C.104/2015

Between:- **M/s Shriram City Union finance ltd** having its Registered office at 111, Angappa Naiken Street, Chennai, and having its Administrative office At 3-6-478, 4th floor, Anand Estates Liberty road Himayath Nagar, Hyderabad, having its branch Office at Rajam represented by its GPA Sri. K.V.Ramana, Now Represented by its GPA Holder Sri. K.Vasu ...Decree Holder.
And:-
1.MOGADALA SATYARAO (DIED)
2.MOGADALA SATISH
3.MOGADALA ANASUYA
4.MOGADALA SRIKANTH
5.SETTY SANTHOSHI
(EA No 553/2022 LRS Petition Allowed Dated On 16.02.2023 The J.Dr No 2 to 5 were added as LRS of the deceased J.Dr No 1)
...Judgment Debtors.
To,
R-5: Setty Santhoshi, D/o late Mogadala Satya Rao, Akkayyapalem, Near; Post Officer Road Vishakapatnam Town and Dist.

Please Take notice that the above Execution Petition is posted for your Sale notice and that you are hereby appear before the Honourable court of the Principal District Judge, Srikakulam on **22-01-2024 AT 10-30 A.M** personally or through Advocate. If you fails to appear the matter will be decide exparte.

MANCHU JANARDHANA RAO
ADVOCATE,
SRIKAKULAM, CELL NO: 9849178948

ఉత్సాహంగా యువభేరి

-నేడు బహుమతుల ప్రదానోత్సవం

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్(యూనిఫెస్ట్) 2023-24 ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహిస్తున్నారు. నాల్గవరోజున యువ భేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం వెస్టర్న్ గ్రూప్ సాంగ్, మైమ్, క్లాసికల్ వోకల్ సోలో, కార్టూనింగ్, డిబేట్ పోటీలు, మధ్యాహ్నం ఫోక్-ట్రైబల్ డాన్స్, క్లాసికల్ డాన్స్, ఇనస్టలేషన్, స్కిట్, మెహందీ పోటీలను నిర్వహించారు. అన్ని విభాగాలలో పోటీలు సోమవారంతో ముగిశాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరి నుంచి 23 విశ్వవిద్యాలయాలకు చెందిన 800 మంది విద్యార్థులు ఈ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. ఆరు విభాగాలలో 28 అంశాలలో పోటీలు నిర్వహించారు. దేశ నలుమూలల నుంచి నిపుణులైన 19మంది న్యాయ నిర్ణేతలు విజేతలను ఎంపిక చేశారు. జాతీయ స్థాయిలో పేరుగాంచిన న్యాయ నిర్ణేతలు విద్యార్థుల ప్రతిభను ప్రత్యక్షంగా వీక్షించి విజేతలను ఎంపిక చేశారు. ది అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ (ఏఐయూ) కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ, ఏయూ సమన్వయంతో నిర్వహిస్తోంది. సాంస్కృతిక పోటీలను ఏఐయూ అబ్జర్వర్ డాక్టర్ మనీష్ జంగ్ర పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమ ఏర్పాట్లు కల్చరల్ కో-ఆర్డినేటర్ ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ పరిశీలించారు.



సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నేరాలు ఘోరాలు

బంగారు పుస్తెలతాడు తస్కరణ

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక గణేష్ థియేటర్ సమీపంలో యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఉన్న ఇంట్లో మహిళ మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడు, 2.5 తులాల చైనును ముఖానికి ముసుగు ధరించిన గుర్తు తెలియని మహిళ బలవంతంగా తెంచుకు పోయిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. భీమిలి క్రైమ్ ఎస్ఐ సూర్య ప్రకాశరావు కథనం ప్రకారం.. బోర సీతారత్నం (70) ఒక్కరే ఇంట్లో ఉంటున్నారు. తలుపులు తీసి ఎప్పటి లాగానే ఇంటి ఎదురుగా పూలు కోసి తిరిగి ఇంట్లోకి వెళ్లారు. సుమారు 50 ఏళ్ల మహిళ ముఖానికి ముసుగు ధరించి ఇంట్లో ఉంది. లైటు, టివి ఆపేసి బాధితురాలు సీతారత్నం మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు, చైను బలవంతంగా తెంచుకు పోయింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు నేర విభాగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్యుతాపురం జంక్షన్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పరవాడ మండలం గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన గొర్లి ప్రసాద్ దుర్మరణం పాలయ్యాడు. అచ్యుతాపురం నుంచి పరవాడ వెళ్తుండగా జంక్షన్‌లో అతను నడుపుతున్న స్కూటీ అదుపుతప్పి అటువైపుగా వెళ్తున్న లారీ వెనక చక్రాల కిందకు దూరిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావంతో సంఘటనాస్థలిలోనే ప్రాణాలను విడిచాడు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి -రావికమతం:నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రావికమతం ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు. మండలంలో గొంప గ్రామానికి చెందిన పల్లా నూకరాజు సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం అందిందన్నారు. ఈ మేరకు నూకరాజు విక్రయిస్తున్న సారాను పట్టుకొని ఆయన్ని అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఆయన వద్ద ఐదు లీటర్ల నాటు సారా ఉన్నట్లు గుర్తించామన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి 6వ వార్డు పరిధి ఎఫ్‌సిఐ, రైల్వే లే-అవుట్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ, రూ.1.65 లక్షలతో రోడ్లు, కాలువలు, కల్వర్టులు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. 2019 నుంచి ఇప్పటివరకు కూడా 25 రకాల పథకాలతో సుమారు రూ.20 కోట్లు పైన ఖర్చు చేశామని తెలిపారు. ముత్తంశెట్టి లక్ష్మీప్రియాంక మాట్లాడుతూ, భీమిలి, మధురవాడలో సుమారు రూ.600 కోట్లుకు పైగా ఖర్చు చేసి అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, వైసిపి నాయకులు గాదె రౌశిరెడ్డి, పోతిన యల్లాజీ, పోతిన ప్రసాద్, రాయిన సాయి, జామి శివ, షేక్ జహనార తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు ఒకే అర్జీ

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఛాంబర్‌లో సోమవారం నిర్వహించిన స్పందనకు ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఒక వినతి పత్రం వచ్చింది. తదుపరి చర్యల నిమిత్తం ఆ విభాగం అధికారులకు పంపినట్లు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు.

12వ వార్డులో గడపగడపకు...

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి ఆరిలోవ, అంబేద్కర్‌నగర్, సూర్యతేజనగర్ ప్రాంతాల్లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యాన తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ ఇంటింటికి వెళ్లి సమస్యలనడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైల్డ్ లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, బోని శ్రీనివాసరావు, కన్నేటి సుబ్బారెడ్డి, హుస్సేన్, అర్జున్, మోహన్ పాల్గొన్నారు.

వేములవలసలో 'ముత్తూట్ మనీ'

ప్రజాశక్తి-ఆనందపురం : వేములవలస గ్రామంలో ముత్తూట్ మనీ బ్యాంకును జెడ్‌పిటిసి సభ్యులు కోరాడ వెంకటరావు సోమవారం ప్రారంభించారు. రీజనల్ మేనేజర్ ఎస్ఎన్ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ, బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీకే రుణాలు అందించడమే కాకుండా మధ్యలో వడ్డీతోపాటు అసలు కట్టించుకునే సౌలభ్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మజ్జి వెంకట్రావు, కోరాడ లక్ష్మణ కుమార్, రీజనల్ అడ్మిన్ మేనేజర్ రాజేష్, బ్రాంచ్ మేనేజర్ ఎస్.సంతోష్, టీం సభ్యులు విజయ్, నవీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో ఈ నెల 9వ తేదీన సాయంత్రం 4 గంటలకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ -2024కు సంబంధించి చర్చించేందుకు సమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్‌డిఓ ఎస్.భాస్కరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి -కరాస: రహదారులను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవని కంచరపాలెం ట్రాఫిక్ ఎస్ఐ వాసుదేవరావు హెచ్చరించారు. జివిఎంసి జోన్ 5 టౌన్‌ప్లానింగ్, కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా రహదారులు, ఫుట్‌పాత్ ఆక్రమణలపై సోమవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎన్ఏడి నుంచి మర్రిపాలెం వరకు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు.

బాలుర వసతి గృహాన్ని సందర్శించిన ఎంఎస్‌డబ్ల్యుఒ

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఎఎస్‌డబ్ల్యుఒ రమాదేవి సోమవారం సందర్శించారు. మంచినీటి సమస్య, చాలీచాలని భోజనం, మౌలిక వసతులు సరిగా లేవని ఆదివారం రాత్రి వసతి గృహం విద్యార్థులు రోడ్డుపై నిరసన తెలపడంతో సోమవారం ఆమె వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలనడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో మౌలిక వసతుల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎఎస్‌డబ్ల్యు రమాదేవి



స్టీల్ కంచాలు అందుకున్న విద్యార్థులు

స్టీల్ కంచాల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని బోడమెట్టపాలెం ఎంపిపి పాఠశాలకు చెందిన విద్యార్థులకు 50 స్టీల్ కంచాలను స్థానిక కలిగొట్ల స్విగ్ద శ్రీదేవి ఫౌండేషన్ ఛైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముద్దాడ అప్పయ్యమ్మ, ఉపాధ్యాయులు అనకాపల్లి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-యంత్రాంగం

పెంచిన పింఛన్లను సోమవారం విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల పంపిణీచేశారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు 384 మందికి నూతనంగా మంజూరైన వైఎస్ఆర్ పెన్షన్లను అక్కయ్యపాలెం షాదిఖానా కల్యాణ మండపంలో సోమవారం సమావేశం ఏర్పాటుచేసి రూ.3 వేలు చొప్పున పంపిణీచేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మాట్లాడుతూ, ఉత్తర నియోజకవర్గ పరిధిలో ఇంతవరకు 18,841 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని, 2024 జనవరి 1 నుండి కొత్త లబ్ధిదారులు 384 చేరి మొత్తం 19,225 మందికి చేరారని తెలిపారు. వీరందరికీ రూ.5 కోట్ల 76 లక్షలా 75వేలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, ఎపిడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి 46వ వార్డులో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా కటుమూరి సతీష్ మాట్లాడుతూ, హామీ ఇచ్చిన మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పింఛన్‌ను రూ.3 వేలుకు పెంచి లబ్ధిదారులకు అందజేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐ వరలక్ష్మి, వెల్ఫేర్ సెక్రటరీలు మహేష్, నాయుడు, కుమారి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీలో నూతనంగా మంజూరైన పెన్షన్లను 36 మంది లబ్ధిదారులకు వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యాన తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, ఎంపీ ఎంవివి సత్యనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఒల సంఘం అధ్యక్షునిగా కృష్ణనర్సింహులు



ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభం మండల విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ల (వీఆర్‌ఒ) కమిటీ అధ్యక్షునిగా పెంట పంచాయతీ వీఆర్‌ఒ బి.కృష్ణనరసింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద అన్ని క్లస్టర్ల వీఆర్‌ఒలతో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షునిగా బి.కృష్ణ నర్సింహులు, ఉపాధ్యక్షునిగా జి.శామ్యూల్, కార్యదర్శిగా కె.మల్లుదొర, సంయుక్త కార్యదర్శిగా ఎంటి.సుమలత, ట్రెజరర్‌గా పి.రవికుమార్, మండల కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కె.కనకమహాలక్ష్మి, ఎస్.కనకారావు ఎన్నికయ్యారు.

చోరీ సొత్తు స్వాధీనం

- 15 మంది అరెస్ట్

ప్రజాశక్తి- భీమునిపట్నం : భీమిలి, ఆనందపురం, పిఎం పాలెం క్రైమ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల జరిగిన పలు చోరీ కేసుల్లో సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయా చోరీలకు పాల్పడిన 15 మందిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. స్థానిక క్రైమ్ పోలీస్ స్టేషన్లో సోమవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసుల వివరాలను సిఐ కె.సురేష్, స్థానిక ఎస్సై ఎస్ సూర్య ప్రకాశరావుతో కలిసి నార్త్ పోలీస్ సబ్ డివిజన్ సిసిఎస్ ఎసిపి ఎ.వెంకటరావు వెల్లడించారు.

చక్రవర్తి ఏనుగు పిల్లల కథల సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : అభ్యుదయ రచయితల సంఘం (అరసం) విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యాన ఎస్.హనుమంతరావు రచించిన చక్రవర్తి ఏనుగు పిల్లల కథలు సంపుటిని సోమవారం స్థానిక పౌరగ్రంథాలయంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన తరతరాల సంస్కృతిలో ఉన్న పద్ధతులు, ఆచారాలను నేటి తరం పిల్లలకు అర్థమయ్యే రీతిలో కథలు ఉన్నాయన్నారు. వలస జీవుల జీవితాలు ఎలా మారుతాయో, జీవితం, నైపుణ్యాలను, విలువలు, ఆలోచనలు వంటి అంశాలను సున్నితంగా కథల రూపంలో ప్రస్తావించిన తీరు అద్వితీయమన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రాంబాబు

టోల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- గాజువాక : అగనంపూడి టోల్‌గేటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టోల్‌గేట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సోమవారం టోల్ గేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, టోల్‌గేట్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయట్లేదని అన్నారు. జీతం ప్రతినెలా పదో తేదీన చెల్లించాలని కోరారు. పేస్లిప్పులు ఇవ్వాలని, మహిళలకు మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాలని, బోనస్, ప్రభుత్వ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టోల్‌గేట్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ పి.అనిల్‌కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జి.అశోక్‌కుమార్, నాయకులు కోటి, శివ, మాధవరావు, అప్పలరాజు, ఎల్.శ్రీనివాసరావు, సంతోష్, నాని పాల్గొన్నారు.

మురళీనగర్‌లో హాస్యనాటిక ప్రదర్శన

ప్రజాశక్తి-మాధవధార : మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో ఏక్ దిన్ కా సుల్తాన్ హాస్యనాటికను మాధవధార చైతన్య కళాసాగర్ కళాకారులు ప్రదర్శించారు. ఈ హాస్య నాటికకు వైశాఖి స్పోర్ట్స్ పార్క్ అధ్యక్షులు సనపల వరప్రసాద్ సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ, నాటక రంగ కళాకారులు సనపల సన్యాసయ్యను వైశాఖి స్పోర్ట్స్ పార్క్ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా సనపల వరప్రసాద్ మాట్లాడుతూ, సమాజం మార్పునకు నాటకాలు ఇంతో దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ నాటక రంగాన్ని ప్రోత్సహించాలన్నారు. ఈ హాస్య నాటికలో కళాకారులు సనపల సన్యాసయ్య, సనపల రామానుజయ, పైడి గిరిధర్, అన్నెపు కొండలరావు, సనపల సత్యనారాయణ, సనపల హరిబాబు నటించారు.

వాలంటీర్లకు నియామకపత్రాలు

ప్రజాశక్తి-సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలో నూతనంగా నియమితులైన వాలంటీర్లకు షాదీఖానా కల్యాణ మండపంలో నియామకపత్రాలను నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని వాలంటీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, ఎపిడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

'రౌడీ పాలనకు స్వస్తి చెప్పాలి'

ప్రజాశక్తి - ములగాడ : రౌడీ పాలనకు స్వస్తి చెప్పి స్వేచ్ఛా పాలనకు స్వాగతం పలకాలని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు కోరారు. జివిఎంసి 59వ వార్డు పరిధి పిలకవానిపాలెంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్ టిడిపి ఆధ్వర్యాన సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 2019కి ముందు 2019 తర్వాత పనితీరు ఎలా ఉందో ప్రజలకే తెలుస్తుందన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికీ 85 శాతం నెరవేరలేదని తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు పర్మినెంట్, సిపిఎస్ రద్దు, మద్యపానం నిషేధం తదితర హామీలేవి అమలుకాలేదన్నారు. రాక్షస పాలనకు ప్రజలే ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మజ్జి సోమేష్, నీలాపు జోజి, కోరాడ శ్రీనివాసరావు, కాకి పోల్‌రెడ్డి, డోప్ప సన్యాసిరావు, జయశంకర్, పాసి చిన్న, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, మిత్తిరెడ్డి శంకర్, జెర్రిపోతుల నర్సింగరావు, గల్లా చిన్న, తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో వైసిపి నేతల పర్యటన

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 87వ వార్డు గణేష్‌నగర్ సచివాలయం పరిధిలో వైసిపి నాయకులు సోమవారం పర్యటించారు. వార్డు ఇన్‌ఛార్జి కోమటి శ్రీనివాస్ ఆధ్వర్యాన గాజువాక నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఉరుకూటి చందు వడ్లపూడి, కుంచుమాంబ, కణితి నాయి బ్రాహ్మణ వీధి, ఏరుకుల వీధి, రజకుల వీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి రామచంద్రరాజు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, మార్పు శేషు, కోమటి రమాదేవి పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-యంత్రాంగం

డిమాండ్లు నెరవేర్చాలని పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారమూ కొనసాగింది. పలుచోట్ల చెత్త తరలించేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలను కార్మికులు అడ్డుకున్నారు.

తగరపువలస: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ జివిఎంసి పారిశుధ్య కార్మికులు గత కొద్ది రోజులుగా చేస్తున్న సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు సంబంధిత అధికారులు సోమ వారం ప్రయత్నించగా కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టారు. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము పర్యవేక్షణలో స్థానిక మార్కెట్ వద్ద ఉన్న చెత్తను తరలించేందుకు ఓ వాహనం రాగా, సమాచారం అందుకున్న పారిశుధ్య కార్మికులు, జివిఎంసి ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి జోన్ గౌరవాధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి ఆధ్వర్యాన అడ్డుకున్నారు. జోనల్ కమిషనర్ వారిని ఒప్పించే ప్రయత్నం చేసినప్పటికీ కార్మికులు తమ పట్టు వీడ లేదు.



నర్సీపట్నంలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సురేష్, రాజేష్, వెంకట్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు కార్యాలయం వద్ద సోమవారం పారిశుధ్య కార్మికులు, క్లాప్ వాహన డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎస్.చిన్న, ఎస్.రామప్పుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, తిరిగి కార్మికులపై దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సామరస్యంగా చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. దాడులు, దౌర్జన్యాలతో ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి.రాంబాబు, వి.గోవింద, కె.సుజాత, క్లాప్ యూనియన్ నాయకులు బి.అప్పలరెడ్డి, ఎ.అశోక్, కె.సన్ని, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గాజువాక జోన్ కమిటీ ఆధ్వర్యాన జివిఎంసి జోనల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, సమస్యలు పరిష్కరించాలని పారిశుధ్య, నీటి సరఫరా కార్మికులు సమ్మె చేస్తుంటే విధుల్లో చేరాలని జోనల్ కమిషనర్ నోటీసులు పంపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్మికులను భయభ్రాంతులకు గురిచేయడం



గాజువాక జోనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

తగదన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొలగాని అప్పారావు, నక్కా నాగరాజు, గణేష్, చిన్నారావు, మీనాక్షి, కుమారి, అరుణ సత్యవతి, హేమ కుమారి, బాలరాజు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: సమస్యలు పరిష్కరిం చాలని నర్సీపట్నంలో సోమవారం మున్సిపల్ కార్మికులు వినూత్నంగా నిరసన చేపట్టారు. వేప కొమ్మలను కట్టుకొని ర్యాలీ నిర్వహించి అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద గడ్డి తింటూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, కరోనా సమయంలో పని చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఉద్యోగ భద్రత, కాంట్రాక్ట్ బేసిక్‌లో పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు శ్రీను, బుర్ర ప్రసాదు, కుమారు, లక్ష్మీ పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఎన్ఎడి కొత్త రోడ్డు సమీపంలోని రామకృష్ణ హైస్కూల్‌లో జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రయివేట్ స్కూల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణారెడ్డి, పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.చంద్రశేఖర్, ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బివి.రామాంజనేయులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు జి.మురళీధర్, సివి.గోపాలరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎస్‌వికె.పరశురాం మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 85 పాఠశాలల నుంచి 112 గ్రూపులుగా 300 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు రాత పరీక్షలు, ప్రాజెక్టులు, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో 36 మంది విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారన్నారు. వీరిలో



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

ఆరుగురిని ఫిబ్రవరి నెలలో గుంటూరులో జరగబోయే రాష్ట్రస్థాయి చెకుముకి సైన్సు సంబరాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి జివిఎంసి మల్కాపురం హైస్కూల్, ప్రైవేట్ స్కూల్ నుంచి ఎన్ఎడి బ్రాంచ్ శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వెలికి తీయడం కోసం చేస్తున్న కృషిని పలువురు ప్రముఖులు అభినందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు కె.శేషగిరిరావు, సైన్స్ ఆఫీసర్ కె.ప్రసాదరావు, ఎస్‌వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బి.తాళ్లవలసలో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని బి.తాళ్లవలసలో పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.ప్రభాకర్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొంటారని, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు హాజరుకావాలని కోరారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటిని అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలిన 'ఉక్కు' కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు సారిపల్లి సాండ్ మైన్స్, గర్భాం మాంగనీస్ మైన్స్‌ను ఏడాదిన్నగా రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించకుండా కేంద్ర ప్రభుత్వానికి నిరసిస్తూ కార్మిక సంఘాల నేతలు విజయనగరం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునివ్వడంతో సోమవారం కూర్మన్నపాలెం కూడలి నుంచి పెద్దఎత్తున కార్మికులు కార్లతో ర్యాలీగా తరలివెళ్లారు. విజయనగరంలోని కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాక ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ అయోధ్యరామ్ మాట్లాడుతూ, 40 సంవత్సరాలుగా ఈ మైన్స్ స్టీల్‌ప్లాంట్ ఆధీనంలో ఉన్నాయన్నారు. మాంగనీసు టన్ను రూ.3000కు స్టీల్‌ప్లాంట్ కొనుగోలు చేస్తోందని తెలిపారు. ఈ గనులను పునరుద్ధరించకపోవడంతో ఇప్పుడు బయట మార్కెట్లో రూ.13 వేలకు కొనాల్సి వస్తుందని తెలిపారు. దీనివల్ల స్టీల్‌ప్లాంట్‌కు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ మాట్లాడుతూ, ఇసుక రీచ్‌లు ఉన్నప్పటికీ బయట కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మాంగనీసు, ఇసుకకు అదనంగా చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. 40 ఏళ్లుగా ఉన్న మైన్స్‌ను ఏడాదిన్నర కాలంగా ఎందుకు తొక్కు పెట్టారో చెప్పాలని డిమాండ్‌చేశారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సెజ్ కమిషనర్

ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉక్కునగరం : ప్రజాశక్తి 2024 కేలండర్‌ను విఎస్ఇజెడ్ కమిషనర్ ఎం.శ్రీనివాసరావు సోమవారం దువ్వాడలోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విఎస్ఇజెడ్ కార్మికులకు, విశాఖ వాసులకు, ప్రజాశక్తి సిబ్బందికి కమిషనర్ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 65వ వార్డు పరిధి కెఎల్.రావు నగర్‌లో రూ.4 లక్షలతో చేపట్టనున్న పార్కు ప్రహరీ ఎత్తు, మరమ్మత్తు పనులకు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డులోని అన్ని కాలనీలను అభివృద్ధి చేసేందుకు అంచనాలు రూపొందించామన్నారు. పార్కుల అభివృద్ధితో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సత్యం, వంగపండు రామకృష్ణ, కాపారపు తిరుపతిరావు, రామకృష్ణ, పోలీస్, శ్రీనివాస్, రవికుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ నేతల ముందస్తు అరెస్టు



డివైఎఫ్ఐ నాయకులను అరెస్టు చేస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈనెల 10వ తేదీన విజయవాడలో జరిగే చలో సీఎం కార్యాలయం ముట్టడికి వెళ్లకుండా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శివాజీని సోమవారం అనకాపల్లి పట్టణ ఎస్ఐ సత్యనారాయణ ముందుగానే అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తీసుకెళ్లారు.

గృహనిర్బంధం సిగ్గుచేటు

ప్రజాశక్తి: అనకాపల్లి : మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం చేపట్టే ఆందోళనకు వెళ్ళకుండా నిరుద్యోగులను గృహనిర్బంధాలు చేయడం సిగ్గుచేటని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి రాజు మండిపడ్డారు. తనను పోలీసులు గృహ నిర్బంధం చేయడంపై ఆక్షేపించారు. తక్షణమే మెగా డిఎస్‌సి, గ్రూప్ 1 గ్రూప్ 2 ,తోపాటు వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరో మూడు నెలల్లో వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి నిరుద్యోగ యువత తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

నూతన కార్యవర్గాల ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి- అనకాపల్లి : గౌరీ పంచాయతన దేవాలయం నూతన అధ్యక్షులుగా కర్రి సన్యాసినాయుడు. కార్యదర్శిగా బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారిగా శరగడం జగదీష్, మరో 22 మంది సభ్యులు, కొణతాల ఎసి కల్యాణ మండపం కన్వీనర్‌గా ఆళ్ల మహాలక్ష్మి నాయుడు, అయ్యప్ప స్వామి దేవాలయం కన్వీనర్‌గా మళ్ల సూర్య ప్రకాశరావు, మళ్ల జగన్నాథం కల్యాణ మండపం నిర్మాణ కమిటీ కన్వీనర్‌గా పెంటకోట సుబ్రహ్మణ్యం, కో కన్వీనర్‌గా బుద్ద రమణాజీలు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. గౌరీ పంచాయతన దేవస్థానంలో గౌరీ గీతా మహిళా మండలి కన్వీనర్ కొణతాల శివకుమార్, నూతన పాలకవర్గం సభ్యులతో వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ (పెద్దబాబు) ప్రమాణ స్వీకారం చేయించారు.

వనిత వాసవి క్లబ్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి -అనకాపల్లి : వాసవి క్లబ్ వనిత అనకాపల్లి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం అనకాపల్లి వైఎంవిఎ హాల్లో ఘనంగా జరిగింది.వాసవి క్లబ్ వనిత ప్రెసిడెంట్‌గా జంగాల ఫణి, కార్యదర్శిగా జి సువర్ణ, ట్రెజరర్‌గా డి సునీత ప్రమాణ స్వీకారం చేశారు. వాసవి క్లబ్ ప్రస్తుత గవర్నర్ వై.నరసింగరావు ఇన్స్టలేషన్ ఆఫీసర్‌గా ప్రమాణస్వీకారం చేయించారు వాసవి క్లబ్ పూర్వ గవర్నర్ పిఎస్ వరహాలరావు హాజరయ్యారు.కార్యక్రమంలో క్యాబినెట్ ట్రెజరర్ కొల్లూరి పూర్ణిమ, సెక్రటరీ కడిమిశెట్టి పీవీ స్వామి, వైస్ గవర్నర్ శ్రీనాథ్ మాధవ్, రీజియన్ సెక్రెటరీ వి వెంకటరాజు, జోన్ చైర్మన్, జి నాగిని దేవి, కె.కవిత, ఎం పద్మజ పాల్గొన్నారు.

రామ్‌కో సిమెంట్స్‌కు బిఐఎస్ అవార్డు

ప్రజాశక్తి -కశింకోట : సిమెంట్ తయారీలో అత్యున్నత నాణ్యత ప్రమాణాలు పాటించిన రామ్‌కో సిమెంట్స్, వైజాగ్ యూనిట్‌కు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బిఐఎస్) 77వ వార్షికోత్సవ సందర్భంగా అవార్డు అందించిందని సీనియర్ జనరల్ మేనేజర్ పి.వీరపాండియన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.కళాధర్‌రావు తెలిపారు.




అవార్డు స్వీకరిస్తున్న రామ్‌కో ప్రతినిధి సురేష్

విజయవాడలో బిఐఎస్ సీనియర్ డైరెక్టర్ ఎంఏజె వినోద్ నుంచి ఫ్యాక్టరీ డిప్యూటీ జనరల్ మేనేజర్ సిహెచ్.సురేష్ కుమార్ అవార్డును స్వీకరించినట్టు తెలిపారు. కార్మికులు, ఉద్యోగుల సమష్టి కృషితో ఈ విజయం సాధించామని తెలిపారు

మోకాళ్లపై సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

20వ రోజుకు చేరిన సమ్మె


మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు ఆదివారానికి 20వ రోజుకు చేరాయి. సమ్మెలో భాగంగా మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు పి.పుండరీకాక్ష, కార్యదర్శి ఎల్.చైతన్య మాట్లాడారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని భాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.లక్ష్మి, ఐ.శ్రీరామ మూర్తి, వినోద్, రాంబాబు, వసుమతి పాల్గొన్నారు.

అనకాపల్లి : జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె సోమవారం నాటికి 20వ రోజుకు చేరుకుంది. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చెయ్యాలని, కనీసం హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేసారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరేవరకు వెనక్కు తగ్గేది లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా జెఎసి ముఖ్య నాయకులు అచ్యుతకృష్ణ, వెంకటరావు, రామ చంద్రరావు, నాగేశ్వరరావు ఖాదర్, నూకేష్, సతీష్, నాయుడు పాల్గొన్నారు.

అభిజిత్ యాజమాన్యంతో చర్చలు సఫలం

ఐదు రోజుల ఆందోళన విరమించి విధులకు హాజరైన కార్మికులు


ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అభిజిత్ పరిశ్రమలో కార్మికులకు పూర్వం మాదిరిగానే నెలలో 30రోజులఉ పనికల్పిస్తామని యాజమాన్యం అంగీకరించడంతో ఐదు రోజులుగా చేస్తున్న ఆందోళనను కార్మికులు విరమించారు. పరిశ్రమ ప్రతినిధులకు, కార్మికులకు మధ్య సోమవారం జరిగిన చర్చలు సఫలం కావడంతో సోమవారం బి షిఫ్ట్ విధులకు కార్మికులు హాజరయ్యారు. అభిజిత్ పరిశ్రమలో కాంట్రాక్ట్ పద్దతిలో పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్యం నెలకు 15 రోజులు మాత్రమే పని కల్పిస్తామని ఇటీవల చెప్పడంతో ఐదు రోజులుగా ఆందోళన కొనసాగిస్తున్నారు. సిఐటియు నేతృత్వంలో చేపట్టిన ఆందోళనకు. తెలుగుదేశం జనసేన పార్టీలు సంఘీభావం తెలపడంతో పరిశ్రమ యాజమాన్యం దిగొచ్చింది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, ప్రజాసంఘాల మండల కన్వీనర్ కె సోము నాయుడు చెప్పాడా గ్రామ సర్పంచ్ రాజాన నాయుడు బాబు మాజీ సర్పంచ్ రెడ్డి శ్రీనివాసరావు జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బి రామదాసు టిడిపి మండల నాయకుడు రాజాన రామనాయుడు ఆధ్వర్యంలో కార్మికులతో చర్చలు జరిపింది మునుపటిలా నెలలో 30 రోజులపాటు పని కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఊపిరి పోస్తారా... ఉరి తీస్తారా!

రెండో రోజు పెదగంగవరం రైతుల వినూత్న నిరసన


మెడలో ఉరితాడు వేసి రైతుల వినూత్న నిరసన

ప్రజాశక్తి- దేవరాపల్లి : తమ భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి ఊపిరి పోస్తారా, లేక ఉరితీస్తారా చెప్పాలంటూ అల్లూరి జిల్లా, అనంతగిరి మండలం, పెదగంగవరం రైతులకు మెడకు ఉరితాడు వేసుకుని వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. పెద గంగవరంలో రామలయం వద్ద రైతుల నిరసన దీక్షలు సోమవారం రెండోరోజుకు చేరుకున్నాయి. 300 మంది రైతులు ఆందోళనలో పాల్గొని, ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయకపోతే తమకు ఆత్మహత్యలే గతని మెడకు ఉరితాలు వేసుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామ రైతు సంక్షేమ సంఘం నాయకులు కొటాన వెంకటరమణ మాట్లాడుతూ పూర్వీకుల నుంచి గ్రామంలో నివాసం ఉంటున్న తమకు ప్రభుత్వ నిషేధిత గిరిజన సంఘాలు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు తప్పుడు ఆలోచన విధానాల కారణంగా తమ సాగు భూములపై హక్కులు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 1/70 చట్టం అడ్డుపెట్టి తమకు అన్యాయం చేస్తున్నారని, ప్రభుత్వం స్పందించకుంటే ముక్కుమ్మడి ఆత్మహత్యలు తప్ప వేరే గత్యంతరం లేదన్నారు.కార్యక్రమంలో సంఘ నాయకులు కొట్టన అక్కు నాయుడు, తోట దేవుడు కోటన రాము, మిడతాడ శ్రీను, ద్వారపురెడ్డి అప్పలనాయుడు, గవిరెడ్డి దేముడు పాల్గొన్నారు.

ప్రజారోగ్య వేదిక వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి-. అనకాపల్లి : స్థానిక సిఐటియు అనకాపల్లి కార్యాలయంలో ఆదివారం ప్రజా ఆరోగ్య వేదిక కన్వీనర్ మళ్ల చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బిపి, సుగర్, ఫిట్స్ పక్షవాతం తదితర వ్యాధులకు సంబంధించి 120 మంది రోగులకు వైద్యసేవలు అందించారు.ప్రముఖ వైద్య నిపుణులు, లండన్ నుంచి విచ్చేసిన న్యూరాలజిస్ట్ డాక్టర్ సాయిసందీప్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బిసిషుగర్ వ్యాధిగ్రస్తులకు స్థానిక ప్రముఖ వైద్యులు డాక్టర్ మీనేంద్ర కుమార్, డాక్టర్ డి సాంబమూర్తి ఉచిత వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎల్ఐసి ఎంప్లాయ్ రమేష్, రిటైర్డ్ అగ్రికల్చరల్ ఎంప్లాయ్ ఉమామహేశ్వర రావు, ఎస్ఎఫ్ఐ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్‌టిపిసి సింహాద్రి సౌజన్యంతో భారత ప్రభుత్వ సంస్థ సిపిఐఈటి విజయవాడ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణను అందిస్తున్నామని సిపిఐఈటి జాయింట్ డైరెక్టర్, హెడ్ డాక్టర్ సిహెచ్ శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టిపిసి సింహాద్రి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాల్లో స్థానికత ఉండి, 10 వ తరగతి విద్యార్హత, 18నుండి 35సం.లు మధ్య వయస్సు గల 60 మందికి విజయవాడ పోలిమర్స్ టెక్నాలజీలో 6 నెలల నైపుణ్యాభివృద్ధి శిక్షణనిచ్చి సర్టిఫికెట్‌తో పాటు విశాఖపట్నం, అనంతపురం, హైదరాబాద్, బెంగుళూరు, హొసూర్, చెన్నై ప్రాంతాలలో ప్రముఖ ప్లాస్టిక్స్, అనుబంధ సంస్థలలో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు డాక్టర్ శేఖర్ వివరించారు. శిక్షణాకాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలతోపాటు నెలకు రూ.మూడు వేలు స్టయిపెండ్ ను అందిస్తామన్నారు.ఆసక్తి గల యువత సిఐపిఈటి ప్రతినిధి బాణావత్ అంజి నాయక్‌ను 7893586494 ఫోను నెంబర్లో సంప్రదించి దరఖాస్తుల రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

జగన్నాధరావుకు ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డు తీసుకుంటున్న ఏడిఆర్ డాక్టర్ జగన్నాధ రావు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆర్ఏఆర్ఎస్ ఎడిఆర్ డాక్టర్ పివికె. జగన్నాధరావు ఫెలో ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ 2023 అవార్డు అందుకున్నారు. వ్యవసాయ ప్రాసెసింగ్, పంటకోత అనంతర విభాగంలో రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ ప్రాసెసింగ్ మిషనరీ రూపొందించడం, ఆర్ఏఆర్ఎస్‌కు నాలుగు పేటెంట్లు సాధించడం, నాలుగు జాతీయ, మూడు రాష్ట్ర అవార్డులు సాధించడం, 60 వరకు జాతీయ, అంతర్జాతీయ పత్రాలను ప్రచురించడం, రైతులకు ఉపయోగపడే 100 పుస్తకాలు, బుక్లెట్స్, ఆర్టికల్స్ ప్రచురించినందుకుగాను ఈ అవార్డును దక్కింది. ప్రతిష్టాత్మకమైన ఫెలో ఆఫ్ ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీర్స్ 2023 అవార్డును కర్ణాటక రాష్ట్రం రాయచూర్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కన్వెన్షన్, అంతర్జాతీయ సింపోజియంలో డాక్టర్ జగన్నాధ రావుకు అందజేశారు. ఆయనకు ఈ అవార్డు రావడం పట్ల ఆర్ ఏ ఆర్ ఎస్ శాస్త్రవేత్తలు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

కాలువ గట్టు ఆక్రమణ తొలగించాలని ధర్నా


తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన రైతులు

ప్రజాశక్తి- మునగపాక: కృష్ణంరాజు కాలువ గట్టును ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం 'పేట కట్టు' సంఘం రైతులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. రెవిన్యూ సిబ్బంది నిర్లక్ష్య వైఖరి నశించాలని, ఆక్రమణదారులకు కొమ్ముగాస్తున్న విఆర్‌ఒను సస్పెండ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యాలయం ముందు బైఠాయించి సిబ్బందిని విధులకు హాజరుకాకుండా అడ్డుకొని నిరసన తెలియజేశారు. తక్షణం వారిపై చర్యలు తీసుకోకపోతే ఇక్కడినుండి కదిలేది లేదని పట్టుబట్టారు. ఆక్రమణదారులకు తక్షణం నోటీసులు జారీ చేస్తామనిస్థానిక ఇన్‌ఛార్జి తహశీల్దార్ వినయ్ కుమార్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆడారి మహేష్, మళ్ల సంజీవరావు, టెక్కలి కొండలరావు, మళ్ల జగ్గారావు, మళ్ల ముసలి నాయుడు, టెక్కలి గంగరాజు, ఆడారి వెంకట సూర్య అప్పారావు, పెంటకోట సత్యనారాయణ, టెక్కలి సూరప్పారావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో సంక్షోభంలో సాగు



మాట్లాడుతున్న బుద్ద నాగజగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి : జగన్ రెడ్డి నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం రైతులను నాశనం చేసిందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో వ్యవసాయ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారని, ఉద్యానవన రైతు రోడ్డున పడ్డారని, ధాన్యం రైతు దగా పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు సగటున రోజుకు ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం రాష్ట్రంలో సాగు సంక్షోభానికి అద్దం పడుతోందన్నారు.కౌలు రైతుల ఆత్మహత్యల విషయంలో దేశంలోనే ఏపి రెండవ స్థానం, రైతుల ఆత్మహత్యల్లో మూడో స్థానంలో ఉందని ఆవేదన వెలిబుచ్చారు. ధాన్యం కొనేవారు లేరని, రైతులకు రాయితీలు ఎత్తేశారని, అన్నదాతకు బతుకే లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు ద్రోహి జగన్ రెడ్డిను సాగనంపడానికి రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, సిద్ధంగా ఉన్నారన్నారు. తెలుగు రైతు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అక్కిరెడ్డి రమణబాబు, నియోజకవర్గ అధ్యక్షులు రొంగలి సూరిబాబు,పార్లమెంటు అధికార ప్రతినిధి కడిమిశెట్టి నరసింగరావు, సిదిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టిడిపి పాలనతో రైతు సాధికారత

ప్రజాశక్తి- వడ్డాది : టిడిపి అధినేత చంద్రబాబు తోనే రైతు రాజ్యం సాకారమౌతుందని చోడవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, హిట్లర్ తరహాలో జగన్ రివర్స్ పాలనతో రాష్ట్రం 30ఏళ్ళు వెనక్కి వెళ్ళిపోయిందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ శాఖను మూసేయడంతో రైతులు దగాపడ్డారని, ఉద్యానవన రైతులను రోడ్డున పడేశారన్నారు. పోలవరం, సుజలస్రవంతి ఇతరత్రా నీటి ప్రాజెక్టులను నిండా ముంచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మృగ్యమై వారిని గంజాయి, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాల వైపు మొగ్గేలా చేస్తున్నారని మండిపడ్డారు. టిడిపి హయాంలో అమలు చేసిన 100 సంక్షేమ పథకాలను రద్దు చేసి బడుగు, బలహీన వర్గాల ప్రజలను సీఎం జగన్ అన్యాయం చేశారన్నారు. సంక్షేమం పేరుతో చిల్లర చల్లి, వైసిపి నేతలు, కోట్లకు పడగలెత్తుతున్నారని, రాష్ట్రాన్ని లక్షల కోట్లల్లో అప్పుల్లో ముంచేస్తున్నారన్నారు.

నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారు

ప్రజాశక్తి - సబ్బవరం / అచ్యుతాపురం: వైసిపి పాలనలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా సిఎం జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్ గా రాష్ట్రాన్ని మార్చారని అనకాపల్లి జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పిబివిఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు) ఆరోపించారు. సోమవారం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వైసిపి ప్రభుత్వం విస్మరించిందని ఆరోపిస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తెలుగు యువత నేతలు డి. నాయుడు, ఆకుల గణేష్, యడ్ల రమేష్, సునీల్, రవి కుమార్ నమ్మి నరసింగరావు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి- వడ్డాది : జగనన్న పాలనలోనే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు . సోమవారం బుచ్చయ్యపేట మండలం లోపూడి సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి భరోసానిస్తూ ఆరోగ్యశ్రీలో వైద్యం వ్యయపరిమితిని రూ.ఐదు లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచడంతోపాటు అనేక వ్యాధులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లోనూ మెరుగైన వైద్యసేవలు అందుతాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామసభ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పతకాలపై అవగాహన కల్పించారు. వైస్ ఎంపిపి దొండా నారాయణమూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు సాయం రమేష్, యనమల వాసు, తమరాన వెంకటరమణ, సర్పంచులు వేపాడ మధు, తమరాన శ్రీనివాసరావు, మెరుగు కుమారి, బాబూరావు, ఎంపిడిఓ సువర్ణ రాజు పిహెచ్‌సి డాక్టర్ ఆర్.మౌనిక, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు

మెగా డిఎస్‌సి ప్రకటించాలి : డివైఎఫ్‌ఐ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డివైఎఫ్‌ఐ నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : నాలుగేళ్లుగా అదిగోఇదిగో అంటూ నిరుద్యోగులను ఊరిస్తూ, నయవంచన గురిచేస్తున్న మెగా డిఎస్‌సిపై ఈనెల 9 లోగా స్పష్టమైన ప్రకటన చేయకుంటే 10న చలో సిఎం క్యాంపు కార్యాలయం ముట్టడి చేస్తామని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ హెచ్చరించింది. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో 10 న జరిగే చలో సీఎం కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ, ఉపాధ్యక్షులు అల్లు రాజు, జిల్లా కమిటీ సభ్యులు పాంగి చలపతి ఆధ్వర్యంలో స్థానిక దొడ్డి రామనాయుడు కార్మిక కర్షక నిలయంలో సోమవారం ముట్టడి పోస్టర్‌లను ఆవిష్కరించారు .ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

రాష్ట్రంలో 1.88 లక్షల ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట కేవలం 1. 69లక్షలు మాత్రమే ఉన్నారని, దాదాపు 18,520 ఖాళీలతోపాటు ఈనెలాఖరుకు మరో ఐదు వేలమంది ఉపాధ్యాయులు రిటైర్డ్ అవుతున్నరని తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం 117జిఒ పేరుతో మరో 10వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిందని, తెలుగు మీడియం ఎత్తేసి 15వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిందన్నారు. 2వేల పాఠశాలలు మూసివేతతోపాటు, ఏకోపాధ్యాయ పాఠశాలలు 9వేలు ఉన్నప్పటికీ ఇప్పుడు ప్రభుత్వం ఖాళీలు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.. కేంద్రం చెబుతున్న లెక్కలు ప్రకారం 40వేల ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి వెంటనే మెగా డిఎస్‌సి ప్రకటించాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల మంది నిరుద్యోగులు డిఎస్‌సి కోసం నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారన్నారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన నూతన విధానం 2020 రద్దు చేయాలని, తక్షణమే మెగా డిఎస్సీ ప్రకటించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వికలాంగుల వినతి



డిఆర్‌ఒ దయానిధికి వినతి పత్రం ఇస్తున్న వికలాంగులు

ప్రజాశక్తి- అనకాపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ కార్యాలయం వద్ద సోమవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డిఆర్ఓ దయానిధికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు గన్నెడ్డి రాము, కార్యదర్శి పాత్రపల్లి వీరు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది వికలాంగులు ఉన్నారని, వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత 95 వేల మంది పెన్షన్లను తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగ పింఛను రూ.ఆరు వేలకు పెంచాలని, మెట్రో,సిటీ బస్‌లో రాయితీ పునరుద్ధరించి, అర్హులందరికీ ఉచిత బస్‌పాసులు ఇవ్వాలని, వైకల్యాన్ని బట్టి ఉపకరణాలను అందజేయాలని కోరారు. వికలాంగ చట్టాన్ని పటిష్టంగా అమలుచేసి, విద్య, ఉద్యోగం, ఉపాధిరంగాల్లో ఐదుశాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. శారీరక వికలాంగుల ఉద్యోగాల భర్తీలో రోస్టర్ పాయింట్ 56 నుండి 10 పాయింట్‌కు కుదించాలని, స్వయం ఉపాధి రుణాలు అందించాలన్నారు.మేరుగు నూకరాజు ఆధ్వర్యంలో వివిధ మండలాల అధ్యక్షుడు ఆడారి తులసి, సంతోష్ అప్పలనాయుడు, టేకు కుమార్, ఎన్.చిన్నమనాయుడు, ఎల్.గోవింద్, జి.కాసులు, ఎస్.ప్రభాకర్ పాల్గొన్నారు.

స్పందనకు 485 దరఖాస్తులు

అనకాపల్లి : స్పందన అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం – స్పందనలో 485 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని, తిరస్కరిస్తే స్పష్టమైన కారణం తెలియజేయాలన్నారు. స్పందనలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డిఆర్ఓ బి.దయానిధి, ప్రత్యేక ఉప కలెక్టర్లు కె.రామమణి, ఎ.మహేష్ పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయిలతో సమృద్ధిగా తాగునీరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి- చోడవరం : చోడవరం పట్టణంలో ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందించామని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. పంచాయతీ పరిధిలోని గ్రామాలకు రూ.22కోట్ల జల జీవన మిషన్ నిధులతో ఇంటింటికీ 4980 కనెక్షన్లు ఇచ్చామన్నారు. వీటిని ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో సర్పంచ్ బండి నూకాలమ్మ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు, పంచాయతీ ఇఒ నారాయణరావు ఆర్డబ్ల్యుఎస్ జెఇ కనకమ్మ, ఎంపిటిసి పుత్రేవు శ్యామ్, వార్డు సభ్యులు ఒరుగంటి నాగమణి నెహ్రూ, కందర్ప శంకర్ పాల్గొన్నారు

కొత్త వంగడాలతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి -మునగపాక: కొత్త వంగడాలతో రైతులు అధిక దిగుబడి పొందగలరని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం ఎడిఆర్ పి జగన్నాథం అన్నారు. వ్యవసాయ యంత్ర ప్రదర్శనలో భాగంగా స్థానిక తంపరమూల రైతులకు సోమవారం చెరకు పంట సాగు, సస్యరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. చెరకు సాగులో ఆధునిక వ్యవసాయ పనిముట్లను వినియోగించడం ద్వారా సాగు ప్రక్రియ సులభతరంతోపాటు పెట్టుబడులను గణనీయంగా తగ్గించి, అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. రైతులకు అవసరమైన సాగుసూచనలు అందించేందుకు ఆర్ఈఆర్ఎస్ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఇంజనీరింగ్ సైంటిస్ట్ శ్రీదేవి, గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైసిపి మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు, ఎడిఎ ఎం రామారావు, మండల వ్యవసాయ అధికారులు సిహెచ్ జోష్నా కుమారి, పి యు బిపి రంగాచారి, ఎం స్వప్న పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో మూడు స్వర్ణాలు

ప్రజాశక్తి- చోడవరం : ...ఈ నెల 6, 7 తేదీల్లో విశాఖ రైల్వే గ్రౌండ్‌లో నిర్వహించిన 41వ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2024 పోటీలలో వాకర్ క్లబ్ సభ్యులు, వెటరన్ క్రీడాకారులు పోటు వెంకటరమణమూర్తి సత్తా చాటారు. 400, 800,1500 మీటర్లు పరుగులో ప్రథమస్థానం పొంది మూడు బంగారు పతకాలు గెలుచుకున్నారు. ఈ పోటీల్లో చినబాబు మాస్టారు ద్వితీయ స్థానంతో రజత పతకం లభించింది. ఈ సందర్భంగా రమణ మూర్తి, చినబాబులను వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఒరుగంటి రాంబాబు అభినందించారు.

పాడి రైతులకు హెరిటేజ్ బోనస్ పంపిణీ

ప్రజాశక్తి -అచ్యుతాపురం : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని తోటాడ గ్రామంలో 32 మంది పాడి రైతులకు హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో సోమవారం ఏరువాక బోనస్ రూ.1.65 లక్షలను డెయిరీ మేనేజర్ కె.శేషు పంపిణీ చేశారు. పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా హెరిటేజ్ డెయిరీ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎం భాస్కరరావు రామకృష్ణ రాము చరణ్ పాల్గొన్నారు.

అగ్ని బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కె కోటపాడు: గ్యాస్ లీకేజీ ఘటనలో గాయపడిన మండలంలోని గవరపాలెం గ్రామానికి చెందిన వంకల కుమారిని మాడుగుల నియోజకవర్గ టిడిపి నేత పైలా ప్రసాదరావు, స్థానిక నేతలతో కలిసి పరామర్శించారు. బాధితురాలికి రూ.ఐదు వేలు ఆర్థిక సహాయం అందజేశారు. టిడిపి నేతలుకరి సోమునాయుడు, డెక్క శ్రీరామ్, కరి నాయుడు, లెక్కల లక్ష్మినాయుడు, వేచలపు రమణ, గొర్లె గణేష్, కొరువాడ సర్పంచ్ సింగంపల్లి నారాయణమూర్తి, సింగంపల్లి దేముడుబాబు, ఎ కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, కింతాడ మాజీ సర్పంచ్ బండారు నరసింహనాయుడు, గొలగాన రమణ, లెక్కల సత్తిబాబు పాల్గొన్నారు.

డిసిసి ప్రధాన కార్యదర్శిగా కాళ్ల

ప్రజాశక్తి-అనకాపల్లి :కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా జనరల్ సెక్రటరీగా వెంకుపాలెం గ్రామానికి చెందిన కాళ్ల వెంకట సత్యనారాయణను, అనకాపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా కట్టమూరి నూక అప్పారావులను నియమించారు. తమకు పదవి ఇవ్వడం పట్ల ఎపిసిసి అధ్యక్షురాలు గిడుగు రుద్రరాజు, డిసిసి అధ్యక్షులు బొడ్డు శ్రీనివాసరావు, పి సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, పి సి సి జనరల్ సెక్రటరీ శ్రీరామ్మూర్తి,ఉపాధ్యక్షులు మీసాల సుబ్బన్న, సెక్రటరీ జగతా శ్రీనివాసరావు, అనకాపల్లి అనకాపల్లి నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఐ ఆర్ గంగాధర్, మల్లపురెడ్డి కోటేశ్వరరావు, దాసరి సంతోష్, తుట్ట రమణలకు ధన్యవాదాలు తెలిపారు.

ఆకట్టుకున్న లాఫింగ్ క్లబ్ కార్యక్రమాలు

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక వైఎంవిఎ శ్రీధరాల వెంకటరమణ మెమోరియల్ హాల్లో ఆదివారం రాత్రి లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రదర్శించిన అదుర్స్ కామెడీ షో, అనకాపల్లి కెవ్వు కేక, ఆనంద్ మేజిక్, జోక్స్ అనకాపల్లి, సీనియర్ కళాకారులచే పెళ్లిచూపులు స్కిట్, పులకండ విజయబాబుఈల పాట, జోక్స్ హాస్య ప్రియులందరినీ అలరింపజేశాయి. నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణను సత్కరించారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు దాడి వాసు, మురళి, వినకోట బుచ్చిరాజు రాపేటి నారాయణరావు, వృద్ధగిరి శ్రీనివాసరావు భీమరశెట్టి వరాహ దాడి సూరిబాబు దావన్ పాల్గొన్నారు.

అది బిజెపి భజన సభ!

ప్రజాశక్తి- మునగపాక: విశాఖలో బిజెపి ఆధ్వర్యంలో జరిగినది బీసీల సభ కాదని, బీజేపీ భజన సభ అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు ఎద్దేవా చేశారు.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ బిజెపికి బీసీలు గుర్తొస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేసిన బిజెపి, ఇప్పుడు బీసీలపై కపట ప్రేమ చూపుతున్నారన్నారు.

భారీ కంటైనర్ లారీ బోల్తా

ప్రజాశక్తి-పరవాడ: పరవాడ తహశీల్దార్ కార్యాలయం జంక్షన్‌లో సోమవారం మధ్యాహ్నం భారీ కంటైనర్ బోల్తా పడింది. జంక్షన్లో ఆటో స్టాండ్‌లో నిలిచి ఉన్న ఆటోపై కంటైనర్ బోల్తాపడటంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయింది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం, దుకాణాలు ఉండడం, మరోవైపు బోల్తా పడిన కంటైనర్ నుంచి డీజిల్ లీక్ కావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అయితే తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



పాయకరావుపేటలో భోగి మంట వేస్తున్న టీచర్లు

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు.పాఠశాల ఆవరణంలో ముగ్గులు పెట్టి అందంగా అలంకరించారు.భోగి మంటలు వేశారు. విద్యార్థుల వివిధ వేషధారణలు ఎంతగానో ఆకట్టు కున్నాయి.

నక్కపల్లి:ఎన్.నరసాపురం ప్రాథమిక పాఠశాలలో గ్రామ పెద్దల సహకారంతో అపర అన్నపూర్ణ గా పేరుగాంచిన డొక్కా సీతమ్మ, అంబేద్కర్, నేతాజీ, అల్లూరి సీతారామరాజు, వివేకానంద విగ్రహాలను పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. విద్యార్థులకు సంప్రదాయాల పట్ల అవగాహన కలిగించడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఎంఈఓ నరేష్ అన్నారు.

పాయకరావుపేట:శ్రీ చైతన్య విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ఏజీయమ్ సురేష్, ఆర్ఐ గోపీనాథ్, పిన్సిపల్ మాణిక్యాలరావు, అకాడమిక్ కోఆర్డినేటర్ వెంకట రమణ, సి.బ్యాచ్ ఇన్చార్జ్ లోవేష్, డీన్ విజయ్, ఏవో విజయ్, ప్రీప్రైమరీ ఇన్చార్జ్ గౌరి, ప్రైమరీ ఇన్చార్జ్ కల్పన పాల్గొన్నారు.

రావికమతం : మండలంలో కవగుంట ప్రాథమిక కోన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డివిఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంబరాల్లో సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు చేతుల మీదుగా భోగి మంటలను ఏర్పాటు చేశారు. మరుపాక ఆదర్శ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు.

యస్.రాయవరం: మండల కేంద్రంలోని వినయ్ విద్యా సంస్థల విద్యార్థులు సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గులు పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులకు స్కూల్స్ చైర్మన్ బత్తుల వాసు సంక్రాతి విశిష్టను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పారావు పాల్గొన్నారు.

గొలుగొండ:ఏఎల్పురం జిల్లా పరిషత్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ప్రధానోపాధ్యాయులు నాగభూషణం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. భోగిమంటలు, ఎడ్ల బండ్ల ఆకర్షణతో వినూత్నంగా ఈ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు అనే తారతమ్యం లేకుండా ఉదయం నుండి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు.

నర్సీపట్నంటౌన్:గబ్బాడ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు సి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు సాంప్రదాయదుస్తులు ధరించారు. అనంతరం భోగి మంటలను ఏర్పాటు చేశారు.



బుచ్చయ్యపేటలో హరిదాసు వేషధారణలో..

బుచ్చయ్యపేట:సంక్రాంతి పురస్కరించుకొని మండలంలో గల ఐతంపూడి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు చిన్నారులతో పలు రకాల వేషాలను వేయించారు. పలువురు చిన్నారులు, హరిదాసు కొమ్మ దాసరి, నెహ్రూ, అల్లూరి సీతారామరాజు తదితర వేషాలు వేసుకొని పాఠశాలలకు వచ్చారు. చిన్నారులు ముద్దుగులుపే విధంగా వేషాలు వేసుకోవడంతో హర్షం వ్యక్తం చేశారు. సంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేకమైన సంక్రాంతి సందడిని పాఠశాలలో చేశారు

అచ్యుతాపురం : కైట్స్ కళాశాలలో కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తు సంక్రాంతి సంబరాలను జరుపు కున్నారు ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రాలు అలరించాయి. భోగి మంటలు హరిదాసు కీర్తనలు సంక్రాంతి ముగ్గులతో విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి కైట్స్ విద్యా విహార్ ప్రతినిధి పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాండ్రంగి ప్రాథమిక, ప్రాథమికోన్నత, పద్మనాభంలోని జిల్లా పరిషత్ హైస్కూలు, ప్రాథమిక పాఠశాలల్లో వేడుకలు జరిపారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తన కార్యాలయంలో సోమవారం పలువురు బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. మున్సిపాలిటీలోని 4వ వార్డుకు చెందిన నక్కా శ్రీనివాస్‌కు 2లక్షలు, గచ్చపువీధికి చెందిన రుత్తల భాస్కర్‌రావు కుటుంబానికి 3లక్షలు మొత్తం 5లక్షల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే



మాట్లాడుతున్న పద్మావతి

మహిళల ఆర్థికాభివృద్ధికి టిడిపి కృషి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చోద్యం గ్రామంలో సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ మహిళా కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి అయ్యన్న సతీమణి పద్మావతి హాజరై మాట్లాడారు. మహిళల కోసం డ్వాక్రా సంఘాల ద్వారా ఆర్థిక ప్రగతికి చేయూతని అందించడంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. టిడిపి మ్యానిఫెస్టో లో మహిళలకు ముఖ్యపాత్ర ఇవ్వడం జరిగిందని ఆమె అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలుపుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చోద్యం పంచాయతీ మాజీ సర్పంచ్ ఆదపురెడ్డి ప్రభాకర్, టీడీపీ సీనియర్ నాయకులు నెల్లూరి రాజారావు, అడిగర్ల స్వామి నాయుడు, దేవాడ శేషు, నాతిరెడ్డి అప్పలనాయుడు, కొరుప్రోలు ధర్మరాజు పాల్గొన్నారు.



మహిళా మార్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మహిళా మార్ట్ ప్రారంభం

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండల కేంద్రంలో చేయూత మహిళా మార్ట్‌ను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రూ.35 లక్షలతో ఈ మార్టును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డ్వాక్రా మహిళల షేర్ ధనంతో తక్కువ ధరలకు సరుకులు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రుత్తల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు రుత్తల వాసు, డిఆర్డీఏ పిడీ సచీదేవి, నాయకులు భద్రాచలం, గోవింద, బాలకృష్ణ, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, సచివాలయ మండల కన్వీనర్ రమణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాకలపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు డిఎల్ఎంపి ఆర్‌వై.స్వామినాయుడు సోమవారం అవగాహన కల్పించారు. ద్రవ జీవామృతంతో చీడ పీడలు నివారించవచ్చునని తెలిపారు. అన్ని రకాల పంటలకు సహజ సిద్ధమైన ఎరువులు వాడటంతో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. అనంతరం 200 లీటర్ల ద్రవ జీవామృతం తయారు చేశారు.



అవగాహన కల్పిస్తున్న స్వామి



వినతిపత్రాన్ని ఇస్తున్న న్యాయవాదులు

గాంధీ విగ్రహానికి న్యాయవాదుల వినతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఏపి భూ హక్కుల చట్టంను రద్దు చేయాలంటూ నర్సీపట్నంలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాధులు విధులు బహిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చట్టాన్ని రద్దు చేయాలని గత 40 రోజులుగా నిరసన చేపడుతున్నామని తెలిపారు.

కార్మికుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్స్ రెండు నెలలు, సెక్యూరిటీ గార్డ్ లకు 3నెలలు బకాయిలు తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో కార్మికులు సమావేశం ఉదయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు ఎల్‌వి.రమణ మాట్లాడుతూ, కార్మికులకు కనీస వేతనం 21వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నికైంది.

ఇంటింటికీ జనసేన

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలో ఇంటింటికి జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం మండలంలోని చింతలూరు గ్రామంలో మాడుగుల నియోజకవర్గం జనసేన సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ ఇంటింటికి వెళ్లి నూతనంగా ఆవిష్కరించిన 2024 క్యాలెండర్‌ను అందించారు.

ఆడుదాం ఆంధ్రా కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలోని బూరుగుపాలెం గ్రామంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా కిట్లను ఎంపిపి సత్యనారాయణ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా ముగింపు సందర్భంగా గెలిచిన జట్లకు ఈ కిట్లను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:మున్సిపాలిటీ 15వ వార్డులో సోమవారం కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర ఆడుదాం ఆంధ్రా క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నర్సీపట్నంలో కిట్లు ఇస్తున్న కౌన్సిలర్ బుల్లిదొర

10 నుంచి మండల స్థాయి పోటీలు

గొలుగొండ:ఈ నెల 10 నుండి 20 తేదీ వరకు ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ డేవిడ్ రాజ్ సోమవారం తెలిపారు. మండలంలోని సచివాలయం పరిధిలో జరిగిన వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన వారందరికీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయికి వెళ్లాలని ఆయన సూచించారు.

వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ : ధర్మశ్రీ

ప్రజాశక్తి-రోలుగుంట:జగనన్న అవకాశం ఇస్తే మళ్లీ పోటీ చేస్తానని, తన గెలుపునకు మండల నాయకులంతా కృషి చేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. రోలుగుంట ఆంజనేయస్వామి సెంటర్ నుండి కొమరవోలు మీదుగా కుసర్లపూడి రోడ్లకు కోటి 30లక్షలు మంజూరు చేయడం జరిగిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామనిసోమవారం మండలంలో రాజన్నపేట గ్రామంలో విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధికి 1982కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. దీనిలో భాగంగా రోలుగుంట మండలానికి, గొలుగొండ మండలం ఏటిగైరంపేట నుండి ఎంకె.పట్నం, బిబి.పట్నం, రత్నంపేట మీదుగా వడ్డిప వరకూ నాబార్డు నిధులు కోటి 48లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా మండలంలో ప్రతీ గ్రామానికి ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పోతల లక్ష్మీ శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు రాజుబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ



విద్యార్థులకు మెమొంటోలు ఇస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో

మాడుగుల వీనస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- మాడుగుల: జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో మాడుగుల వీనస్ విద్యార్థులు ప్రతిభను కనుపరిచారు. ఆదివారం ఎస్.రాయవరం మండలంలోని పెదగుమ్ములూరు జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీలకు విశేష స్పందన లభించింది. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు జిల్లా వ్యాప్తంగా 50 టీముల నుండి 150 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జన విజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు తాలపురెడ్డి నాగ చంద్ర,ప్రధాన కార్యదర్శి కొలగాన వర ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. చిన్నతనం నుండి అంధ విశ్వాసాలను విడిచి సైన్స్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానంలో మాడుగుల విద్యార్థులు ప్రతిభను కనపర్చారన్నారు. జిల్లాలో మొదటి స్థానంలో మాడుగుల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు తామరపల్లి హేమణ్యా, బి.గోపి చంద్, . మోహన్ లు రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యారు. ద్వితీయ స్థానంలో వీరనారయనం జడ్పీహెచ్ స్కూల్ నుంచి ఆర్ హేమశ్రీ, వై జశ్వంత్, రోహిత్ కుమార్ ఎంపిక అయ్యారు. గెలుపొందిన విజేతలకు జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు చేతుల మీదుగా బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో ఎంపిక అయిన మాడుగుల వీనస్ విద్యార్థులు ఫిబ్రవరి 10,11 తేదీలో విశాఖపట్నం లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్ళవలసి ఉందని నాగచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టి.నాగచంద్ర, కార్యదర్శి గౌరి పట్టపు మహేష్. బి. రాము, ఉపాధ్యక్షులు బి.రామ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిని ఆసుపత్రి నుంచి తీసుకొస్తుండగా..

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి -కోటవురట్ల: కోటవురట్ల మేజర్ పంచాయతీ కార్యదర్శి బి.సుబ్రహ్మణ్యం (61) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన గడిచిన నాలుగు సంవత్సరాలుగా కోటవురట్ల పంచాయితీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. సోమవారం ఆయన తల్లికి చికిత్స నిమిత్తం విశాఖ హాస్పిటల్కు తీసుకెళ్లి తిరిగి వస్తున్న సమయంలో తీవ్ర గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, కుమార్తె ,కుమారుడు ఉన్నారు.గతంలో ఆయన ఇన్చార్జి ఈఓపిఆర్డిగా పని చేశారు. ఆయన అకస్మాత్తుగా మృతి చెందడం పట్ల ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.



సుబ్రహ్మణ్యం (ఫైల్ ఫొటో)



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేంపాడు టోల్ ప్లాజా వద్ద పోలీసులు సోమవారం వాహనాల తనిఖీకి ప్రత్యేక చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా ఈ చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణరావు, పోలీస్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు.

ఎస్మాకు భయపడేది లేదు

-జిఒ 2 ప్రతులు దగ్ధం
-వినూత్నంగా అంగన్‌వాడీల నిరసనలు





అనకాపల్లిలో మాట్లాడుతున్న లోకనాథం

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం కొనసాగింది. సమ్మెను భగ్నం చేయాలని ప్రభుత్వం ప్రయోగిస్తున్న ఎస్మాకు భయ పడేది లేదని అంగన్‌వాడీలు తేల్చి చెప్పారు. జిఒ 2 ప్రతులను దగ్ధం చేస్తూ నిరసనలు చేపట్టారు.

అనకాపల్లి :కలెక్టరేట్‌వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని సిపిఎంజిల్లా కార్యదర్శి కే లోకనాథం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమై సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని మండి పడ్డారు. సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు అత్యవసర సేవల చట్టం ఎస్మా ప్రయోగించడం అన్యాయమని, తక్షణమే దీనిని ఉపసంహరించుకోవాలన్నారు. దీక్షల్లో .కె.రామలక్ష్మి, కెఎంఎస్ జయలక్ష్మి, పి.అంజలి, శ్రావణి, వి.వెంకటలక్ష్మి., వి. లక్ష్మి. ఎస్.సుజాత, కె.మంగ, ఏ.దాలమ్మ,పీ. జానకిదేవి, బి. జయలక్ష్మి., అర్. లక్ష్మి, కె.సీతాలక్ష్మి, పి.శ్రీదేవి, బి. భవానీ,. బి. శశికళ, కె. నాగమణి, బి.నాగమణి, బి .లక్ష్మి రాజ్యం. కె.సూర్యలక్ష్మి. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, జి దేముడు నాయుడు పాల్గొన్నారు.

నక్కపల్లి:సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 28వ రోజుకు చేరింది. మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహారదీక్ష శిబిరం వద్ద అంగన్వాడి వర్కర్స్ గడ్డి తింటూ వినూత్న నిరసన తెలిపారు.28 రోజుల నుండి తామంతా శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం స్పందించకుండా తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, యూనియన్ నాయకులు కవిత, లక్ష్మీ రాజ్యం, మంగ లక్ష్మీ, రమణమ్మ, జయ, ఆర్‌వికె లక్ష్మీ పాల్గొన్నారు.

కోటవురట్ల:తహాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు జిఒ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మండల నాయకురాలు పుష్ప మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో మంగళవారం ధర్నా చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.

పాయకరావుపేట:మండలంలో అంగన్వాడీలు నల్ల బెలూన్లు ఎగురు వేసి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, యూనియన్ నాయకులు బి.నాగేశ్వరరావు, నూకరత్నం, సత్యవేణి, జ్యోతి, తులసి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక బస్టాండ్ ఆవరణలో మాడుగుల, చీడికాడ మండలాల అంగన్వాడీలు సంయుక్తంగా నిర్వహించిన సమ్మెలో రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు పాల్గొన్నారు. ఇదే వైఖరి కొనసాగితే జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ప్రాజెక్ట్ యూనియన్ నాయకులు ఆర్. రామలక్ష్మి, డి. పార్వతి, వి.దనలక్ష్మి, సిఐటియు చీడికాడ మండల నాయకులు ఆర్ దేముడు నాయుడు, మాడుగుల మండల నాయకులు ఇరట నరసింహమూర్తి, ఆయాలు, టీచర్లు పాల్గొన్నారు.



మాడుగులలో మాట్లాడుతున్న నాయనిబాబు



కోటవురట్లలో..

గొలుగొండ: మండల కేంద్రంలో అంగన్వాడీలు నిరసన కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్మా ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ కాపీలను దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, తక్షణమే తమకు వేతనాలు పెంచాలన్నారు.

దేవరాపల్లి : అంగన్వాడీల సమ్మెలో భాగంగా ఎస్మా ప్రయోగాన్ని నిరసిస్తూ సోమవారం దేవరాపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు నల్ల బెలూన్లతో నిరసన తెలిపారు. జిఒ ఉపసంహరించుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.కార్యక్రమంలో జయ, అమ్మాజీ, కోమలి, మణి,రమణమ్మ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : జిఒ 2 రద్దు చేయాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు అందోళన చేపట్టారు. జిఒ2లోని సారాంశాన్ని తాము కళ్లతో చూడబోమని, చెవులతో వినబోమంటూ కళ్లుచెవులు మూసుకుని వినూత్న నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమంలో.అది వరలక్ష్మి, అమ్మాజీ పాల్గొన్నారు.

పరవాడ: పరవాడ తాసిల్దార్ కార్యాలయం ఎదుట జిఒ2కు నిరసనగా అంగన్వాడీలు నిరసన చేపట్టి, ప్రభుత్వం విడుదల చేసిన కాపీలను దగ్ధం చేశారుజ మోకాళ్లపై కూర్చొని దండం పెడుతూ నిరసన చేపట్టారు. అంగన్వాడి యూనియన్ నేత ఎం. రమణి, సుజాత, వెంకటలక్ష్మి, కృష్ణవేణి కుమారి పాల్గొన్నారు.

పరవాడ: మండలంలోని రావాడ పంచాయతీలోని అంగన్వాడీ కేంద్రాలను సోమవారం మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్నా సందర్శించారు. అంగన్వాడీల సమస్యపై ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరిని నిరసించారు. లబ్ధిదారులు పోషకాహారాన్ని పడుతున్న ఇబ్బందులను దృష్ట్యా సమ్మె విరమణకు చర్యలు చేపట్టాలని కోరారు. మాజీ సర్పంచ్ దాసరి వెంకట రమణ, కూండ్రపు శ్రీను, శాలాపు రమణ, స్కూల్ కమిటీ చైర్మన్ దాసరి సోమేశ్వరి, ద్వార పూడి సంతోష్,మహిళలు పాల్గొన్నారు.

సబ్బవరం.: అంగన్వాడీల సమ్మెను నిషేదిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా ఆదేశాలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిఆండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వి.వి.రమణమ్మ, ఎం. వరలక్ష్మి, పుష్ప, జగదీశ్వరి, వి. సుభాషిణి, ఎం. కనకమ్మ,జి. అరుణ కుమారి,ఎస్. రమణమ్మ, డి. భారతి, ఎ. రమణమ్మ, పి. సూరమ్మ, ఎన్. సత్యవేణి పాల్గొన్నారు.

చోడవరం : అంగన్వాడీల నిరవధిక నిరాహార దీక్ష సోమవారం కొనసాగింది. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు దీక్షా శిబిరంలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు నేత ఎస్వీ నాయుడు పాల్గొన్నారు.

కె.కోటపాడు : అంగన్వాడీల నిరవధిక సమ్మెపై ఎస్మా విధించడం దుర్మార్గమని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె శిబిరం వద్ద జిఒ2 ప్రతులను దగ్ధం చేశారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు జి.కుమారి, ప్రాజెక్టు అధ్యక్షురాలు పి.భవాని, సెక్టార్ నాయకులు ఎం.లక్ష్మి, సాయిలక్ష్మి, బి.నూకరత్నం, లక్ష్మి, కెవిపిఎస్ నేత గాడి ప్రసాద్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : తమ డిమాండ్లను నెరవేర్చే వరకూ సమ్మెను విరమించేది లేదని, ప్రభుత్వం అరెస్టులు చేసినా, ఎస్మా ప్రయోగించినా భయపడేది లేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు వై.తులసి అన్నారు. సమ్మెలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సోమవారమూ దీక్షలు కొనసాగాయి. వారి పోరాటానికి విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల చైర్మన్ ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఎం మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడాల రమణ మద్దతు తెలిపారు.

ఎస్మా ప్రయోగం సరికాదు : సూర్యప్రభ

అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించడం సరికాదని ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జి.సూర్యప్రభ అన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ చర్య కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్బంధ ధోరణిని తెలియజేస్తుందని పేర్కొన్నారు.

మాధవధార : సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీల వర్కర్లపై ఎస్మా ప్రయోగించడం సిగ్గుచేటు అని యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సాంబమూర్తి, కె.సత్యనారాయణ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీతం కంటే రూ.1000 అదనంగా ఇస్తానని జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరితే ఎస్మా ప్రయోగించడం దారుణమన్నారు.

తగరపువలస: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు స్థానిక వై జంక్షన్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి మూడో రోజుకు చేరాయి. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు కె.వెంకటలక్ష్మి పలువురు అంగన్‌వాడీలకు పూలమాలలు వేసి రిలే నిరాహారదీక్షలను ప్రారంభించారు.సిఐటియు భీమిలి జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి మాట్లాడుతూ, అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జోన్ అధ్యక్షులు రవ్వ నరసింగరావు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కోశాధికారి కె.పద్మావతి, భీమిలి ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, లక్ష్మి పాల్గొన్నారు

పెందుర్తి : పెందుర్తి ఎంపిడిఒ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు ఐద్వా నాయకులు బి.అనంతలక్ష్మి, సంతోషి, సిఐటియు నాయకులు వెంకయ్య, పి.నూకరాజు సంఘీభావం తెలిపారు. ఐద్వా నాయకులు బి.అనంతలక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు కల్పించినా భయపడకుండా పోరాటం చేస్తున్న అంగన్‌వాడీలను అభినందించారు. అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.బృందావతి, భవాని, దేవి, సాయి, సరస్వతి, మంగ, వరలక్ష్మి, రామలక్ష్మి, ఆదిలక్ష్మి, గౌతమి పాల్గొన్నారు.



పాయకరావుపేటలో నల్లబెలూన్లతో నిరసన